చిగురిస్తున్న ఆశలు

- పటాన్‌చెరు ఇస్నాపూర్ వరకు మెట్రో రైల్ సౌకర్యం
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు



మెట్రో రైలు వంతెన నిర్మాణానికి భూసార పరీక్షలు ప్రారంభం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రోరైలు సౌకర్యం కల్పించేందుకు ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో వంతెన నిర్మాణం కోసం ఇప్పటికే భూసార పరీక్షల (సాయిల్ టెస్ట్) ప్రక్రియ పారంభం కావడంతో స్థానిక ప్రజల్లో మెట్రో రైలుపై ఆశలు చిగురిస్తున్నాయి. త్వరలోనే పనులు కూడా ప్రారంభమవుతాయని విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇంటి అద్దెలకు డిమాండ్

ప్రభుత్వం మెట్రోరైలు సౌకర్యం కల్పిస్తామని ప్రకటించడంతో సమీపంలోని ఆయా కాలనీలలో ఇంటి అద్దెలను అమాంతం పెంచుతున్నారని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమీప ప్రాంతాల నుంచి నిత్యం వేలాదిమంది విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులు నగర ప్రాంతానికి వెళ్లొస్తుంటారు. ఇదే అదునుగా భావించి ఇంటి అద్దెలను రూ.500 నుంచి రూ.1000వరకు పెంచారని పలువురు వాపోతున్నారు. రానున్న రోజుల్లో ఇంటి అద్దెలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని ఇంటి అద్దెలు పెరగకుండా నియంత్రించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్యతో తిప్పలు...

నిత్యం రద్దీగా ఉండే రామచంద్రాపురం, పటాన్‌చెరు ఇస్నాపూర్ ప్రాంతాల్లో తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుండటంతో బస్సుల్లో ప్రయాణం చేయలేని పరిస్థితి నెలకొంది. దీంతో సకాలంలో గమ్యానికి చేరుకోవడం కోసం చాలామంది వాహనదారులు తమ వాహనాలను లింగంపల్లి చౌరస్తా ప్రాంతంలోని ప్రైవేట్ పార్కింగ్‌లలో పార్కింగ్ చేసి మియాపూర్ వరకు వెళ్లి మెట్రో రైలును లేదా లింగంపల్లికు వెళ్లి ఎంఎంటీఎస్ రైలును ఆశ్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం త్వరితగతిన స్పందించి మెట్రోరైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



డివైడర్‌పై భూసార పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

ఆనందంగా ఉంది



ప్రభుత్వం మెట్రో సౌకర్యం కల్పిస్తామని ప్రకటించడంతో ఆనందంగా ఉంది. దీంతో ప్రయాణం మరింత సులభమవుతుంది. రామచంద్రాపురం నుంచి పటాన్‌చెరు మీదుగా ఇస్నాపూర్ వరకు మెట్రోరైలు సౌకర్యం ద్వారా నగర ప్రయాణం మరింత సులభంగా ఉంటుంది. సకాలంలో గమ్యానికి చేరుకోవచ్చు. – రమేష్, స్థానికుడు, పటాన్‌చెరు

ఇంటి అద్దెలను నియంత్రించాలి



మెట్రో రైలు రాకతో పలు కాలనీలలో ఇప్పటికే ఇంటి అద్దెలను పెంచారు. పనులు ప్రారంభమైతే ఇంటి అద్దెలు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఇంటి అద్దెల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. – అబ్రార్ అహ్మద్, స్థానికుడు, రామచంద్రాపురం

పనులు పూర్తి చేయించండి

- సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: ఉపాధిహామీ పథకం ద్వారా సీసీ రోడ్లు, మన ఊరు..మనబడి పనులను సంబంధించి అడ్వాన్స్‌గా చెల్లించిన డబ్బులతో అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తిచేయించాలని ఎమ్మెల్యే సంజీవరెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఖేడ్ మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. పనులు చేపట్టకుండా అడ్వాన్స్‌గా కాంట్రాక్టర్లకు డబ్బులు ఇవ్వొదన్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన తరుణంలో మిగిలి ఉన్న పనులను ఆయా మాజీ సర్పంచ్‌లతో పనులు పూర్తి చేయించాలని సూచించారు. లేనిపక్షంలో కార్యదర్శుల వేతనాల నుంచి రికవరీ చేసే అవకాశం ఉంటుందన్నారు. అసైన్డ్ భూములను కొందరు అధికారులతో కుమ్మక్కై తమపేర్లపై అక్రమంగా పట్టా మార్చుకున్నట్లు ఆరోపణలు వస్తున్నందునా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ చాందీబాయి, వైస్ ఎంపీపీ సాయిరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, బంజారా సేవాలాల్ సంఘం అధ్యక్షుడు రమేష్ చౌహాన్, ఎంపీటీసీలు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

7న మహిళా దినోత్సవం

ఈ నెల 8న మహిళా దినోత్సవం ఉండగా అదేరోజు మహాశివరాత్రి పండుగ ఉన్నందునా 7వ తేదీన ఉదయం 11 గంటలకు జూకల్ శివారులోని కన్వెన్షన్ హాల్‌తో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే సంజీవరెడ్డి తెలిపారు. ఆయా శాఖల మహిళా ఉద్యోగులు, మహిళా ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని సూచించారు.

కాలుష్య సమస్యను పరిష్కరించండి

- సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

జిన్నారం(పటాన్‌చెరు): వాయు, జల కాలుష్య సమస్యను వెంటనే పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. జిన్నారం మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ రవీందర్‌గౌడ్ అధ్యక్షత మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు చెందిన అధికారులు వారి నివేదికలను సభకు వివరించారు. అనంతరం పలువురు బీఆర్ఎస్ ఎంపీటీసీలు మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే రైతులకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కూరగాయ పంటల సాగు వివరాలను గ్రామాల్లో ప్రత్యేక సభలను ఏర్పాటు చేసి రైతులకు వివరించాలని సభ్యులు ఉద్యానవనశాఖ అధికారులకు సూచించారు. గ్రామాల్లో నీటి సమస్యలు రాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ధరణికి సంబంధించి గ్రామాల్లో చేపడుతున్న కార్యక్రమాలను డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున్ సభ్యులకు వివరించారు. పంచాయతీ రాజ్ శాఖ ద్వారా గ్రామాల్లో చేపడుతున్న పనుల వివరాలను అధికారులు తమకు తెలపటం లేదని సభ్యులు ఆరోపించారు. గడ్డపోతారం, ఖాజీపల్లి పారిశ్రామికవాడల్లోని పరిశ్రమలు రాత్రి సమయంలో వాయు కాలుష్యాన్ని వదులుతున్నాయని సభ్యులు జనాబాయి, భార్గవ్ తదితరులు వివరించారు. కాలుష్యాన్ని వదిలే 27 పరిశ్రమలకు ఇప్పటికే నోటీసులు ఇచ్చామని పీసీబీ అధికారులు తెలిపారు. అనంతరం ఎంపీపీ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ సభలో దృష్టికి వచ్చిన ప్రతి సమస్యను సత్వరమే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో జెడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీడీఓ అరుణ, డిప్యూటీ తహసీల్దార్ కరుణాకర్, ఆయా శాఖల అధికారులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధరణి స్పెషల్ డ్రైవ్‌ను పూర్తి చేయాలి

సంగారెడ్డి టౌన్: ధరణి దరఖాస్తుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ క్రాంతి అధికారులను ఆదేశించారు. జిల్లాలోని రెవెన్యూ అధికారులతో మంగళవారం టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధరణి పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియను ఈ నెల 9వ తేదీన 100శాతం పూర్తి చేయాలన్నారు. డిస్పోజల్ ఆఫ్ అప్లికేషన్స్ దరఖాస్తులు, మండల పరిధిలో ధరణి మాడ్యూల్స్ ప్రకారం చర్యలు చేపట్టిన రికార్డులను కలెక్టర్ కార్యాలయానికి అందజేయాలని సూచించారు. జిల్లా రెవెన్యూ డివిజన్ అధికారులు, తహసీల్దార్లు, అధికారులు, పాల్గొన్నారు.

మేలు రకం వంగడాలతో దిగుబడులు



క్షేత్ర దినోత్సవంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

న్యాల్‌కల్(జహీరాబాద్): అధిక దిగుబడులను ఇచ్చే మేలు రకం పంటలను సాగు చేసుకోవాలని డీడీఎస్, కేవీకే శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసాద్, రమేష్ శైలజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రేజింతల్ గ్రామ శివారులో డీడీఎస్, కేవీకే వారు కుసుమ పంటలో క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు కుసుమ పంటలో మంచి దిగుబడులు పొందేందుకు ఐఎఫ్ఎస్–764 రకం విత్తనాలను సాగు చేసుకోవాలన్నారు. ఈ రకం పంటను సాగు చేసుకుంటే ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి, గోపాల్‌రెడ్డి, వెంకట్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలు దర్శనం

పటాన్‌చెరు టౌన్: మోదీ సభా వేదిక వద్ద ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. బీజేపీ జిల్లా నాయకత్వం సభకు జన సమీకరణ చేయడంలో విఫలమైందనే ఆరోపణలు వచ్చాయి. మెదక్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ జనాలను ఈ సభకు తీసుకురావడంలో వైఫల్యం చెందారనే గుసగుసలు వినిపించాయి. మోదీ రాకముందు సభా ప్రాంగణంలోని వేదిక కుడివైపు ఉన్న ఖాళీ కుర్చీలను పూరించాలని మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావు పదేపదే విజ్ఞప్తి చేయడం కనిపించింది. పోలీసుల అతి ప్రవర్తన కారణంగానే కార్యకర్తలు సభకు రాలేకపోయారని వివరణ ఇస్తున్నారు. ఔటర్‌పై, జీఎంఆర్ ఫంక్షన్ హాల్ వద్ద ట్రాఫిక్ జామ్‌లో కొందరు చిక్కుకుపోయారని వివరించారు. పార్కింగ్ కూడా దూరంగా ఏర్పాటు చేశారని ఆరోపించారు. బీజేపీ సీనియర్ నేత అదెల్లి రవీందర్ కారును ఎల్లంకి కాలేజీ వద్ద పోలీసులు ఆపేశారు.



మోదీ సభకు షార్ట్ కట్ రూట్‌లో వస్తున్న అభిమానులు

కార్మికుల నమ్మకాన్ని నిలబెట్టాం

- బీఆర్‌టీ యూనియన్‌ను గెలిపించండి
- ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కార్మికుల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా కృషిచేస్తున్న బీఆర్‌టీ యూనియన్ కార్మిక సంఘాన్ని బలపరిచాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పెన్నార్ పరిశ్రమ కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ నెల 6వ తేదీన పెన్నార్ పరిశ్రమంలో జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బండ్లగూడలో ఉన్న పెన్నార్ పరిశ్రమ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో కార్మికులు ఎంతో నమ్మకంతో బీఆర్‌టీయూను నాయకత్వాన్ని బలపరిచారని, ఇందుకు అనుగుణంగా కార్మికులకు మెరుగైన వేతనం ఒప్పందం అందించడంతో పాటు వివిధ సౌకర్యాలు కల్పించినట్లు గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, పెన్నార్ కార్మిక సంఘం అధ్యక్షులు రాంబాబుయాదవ్, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, బీఆర్ఎస్ పటాన్‌చెరు మండల అధ్యక్షుడు పాండు, కార్మిక సంఘం ప్రతినిధులు ఎస్‌వీ రావు, లకోష్మరెడ్డి, సోమేశ్వర్, పెంటయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, జానకిరామ్, రామ్‌మోహన్‌రావు, శ్రీరామ్‌సింగ్, బీవీ రావు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

బండల మల్లన్నస్వామికి పూజలు...

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన బండల మల్లన్నస్వామి కల్యాణం, జాతర మహోత్సవాల్లో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేలు ఘనంగా సన్మానించారు. మాజీ సర్పంచ్ ధరణి అంతిరెడ్డి, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీ కాలేజీ పీడీ సుప్రియకు డాక్టరేట్



సుప్రియ

జోగిపేట(అందోల్): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సుప్రియకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగంలో డాక్టరేట్‌ను అందజేశారు. ఎఫెక్ట్ ఆఫ్ యోగి ప్రాక్టీసెస్ ఆన్ ఫిజికల్ ఫిజిలాజికల్ అండ్ సైకలాజికల్ వేరియబుల్స్ అమౌంట్ సెంట్రల్ తెలంగాణ రూల్స్ అనే అంశంపై ప్రొఫెసర్ దీప్లా మార్గదర్శకత్వంలో సమర్పించిన పరిశోధన గ్రంథానికి గాను ఆమెకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టరేట్ పొందిన సుప్రియను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, బోధన, బోధనేతర సిబ్బంది అభినందనలు తెలిపారు.

మేధాశక్తిని పెంచేందుకే సైన్స్‌ఫేర్



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణ

జోగిపేట(అందోల్): విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచేందుకే సైన్స్‌ఫేర్‌ను దోహదపడుతుందని ఎంఈఓ బండి కృష్ణ అన్నారు. మంగళవారం జోగిపేటలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ సెక్రటరీలు డాక్టర్ అనంతరెడ్డి, రాంబాబు, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు గౌసోద్దీన్, రిటైర్డ్ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, యూనియన్ నాయకుడు నవీన్‌గౌడ్, సినీ ఆర్టిస్ట్ పద్మారావు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడిన బాధిత కుటుంబాన్ని ఆదుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు రూ.4లక్షల ఆర్థిక సహాయం అందించారు. మండలంలోని దిడిగి గ్రామానికి చెందిన ప్రశాంత్ కుటుంబంలోని నలుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. వీరిని హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. వైద్యం కోసం రూ.12లక్షలు అవసరం అవుతాయని బాధిత కుటుంబం పేర్కొంది. ఈ విషయం ఎమ్మెల్యే మాణిక్‌రావు మాజీ మంత్రి హరీశ్‌రావు దృష్టికి వెళ్లగా స్పందించారు. మంగళవారం ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గాలి అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గుండప్పలు ఆస్పత్రికి వెళ్లి రూ.4లక్షల చెక్కును అందజేశారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు కిజర్ యాఫై రూ.3లక్షల ఆర్థిక సహాయం అందించగా కాంగ్రెస్ జహీరాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఉజ్వల్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి భాస్కర్ రూ.2లక్షల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా దాతలకు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

గృహజ్యోతికి దరఖాస్తుల స్వీకరణ

రాయికోడ్(అందోల్): గృహజ్యోతి పథకంలో భాగంగా 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించుకొని జీరో బిల్లులురాని వినియోగదారుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ మసూద్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత రెండు రోజులుగా తమ కార్యాలయంలో దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో నమోదు కోసం ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశామన్నారు. వీరిలో సుమారు 1700 మంది అర్హులైన వారికి జీరో బిల్లులు జారీ కాలేదన్నారు. ప్రజా పాలన దరఖాస్తులను మరోసారి పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేసి అర్హులైన ప్రతి వినియోగదారుడికి జీరో బిల్లు వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

యువకుడు అదృశ్యం



భాస్కర్‌రెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్): వ్యవసాయ పనుల నిమిత్తం ఇంటి నుంచి వెళ్లిన యువకుడు అదృశ్యమైన సంఘటన మండలం కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని గినియర్‌పల్లి గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్ద డైరీఫాం కొనసాగిస్తూ జీవనం సాగిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 2న డైరీ ఫాం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు భాస్కర్‌రెడ్డి కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తండ్రి విఠల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపల్ చైర్మన్‌కు సన్మానం



ఆనంద్ స్వరూప్ షెట్కార్‌ను సన్మానిస్తున్నన్యాయవాదులు

నారాయణఖేడ్: ఇటీవల ఖేడ్ మున్సిపల్ చైర్మన్‌గా ఎన్నికైన న్యాయవాది ఆనంద్ స్వరూప్ షెట్కార్‌ను మంగళవారం స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ఆయనను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తమ తోటి న్యాయవాది చైర్మన్‌గా ఎన్నికవ్వడం పట్ల పలువురు సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మారుతి రెడ్డి, భోజిరెడ్డి, నర్సారెడ్డి, నర్సింహారావు, వైద్యనాథ్‌పాటిల్, సంగమేశ్వర్‌రెడ్డి, సాయిలు, సుధాకర్, రాజు, శివశంకర్, ప్రశాంత్, విజద్‌నాయక్ పాల్గొన్నారు.

చెరకు రైతులకు బకాయిల చెల్లింపు

జహీరాబాద్: చెరకు రైతులకు ట్రైడెంట్ యాజమాన్యం 2022–23 క్రషింగ్ సీజన్‌కు సంబంధించిన తుది బకాయిలను విడుదల చేసింది. మంగళవారం ఈ మేరకు రూ.1.78కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసినట్లు కర్మాగారం డైరెక్టర్ కిజర్ యాఫై పేర్కొన్నారు. దీంతో రైతులకు పూర్తిస్థాయి బకాయిలు చెల్లించినట్లయిందని వివరించారు. 9 మంది రైతులకు సంబంధించిన ఖాతాలు సరిగా లేకపోవడంతో రూ.1.83 లక్షలు జమ కాలేదన్నారు. తమను సంప్రదిస్తే చెల్లింపులు జరుపుతామన్నారు. వచ్చే సీజన్‌లో క్రషింగ్‌ను కొనసాగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు, రైతులు, పాత యాజమాన్యం సహకరిస్తే రెండు నెలల్లో పరిశ్రమల్లో మరమ్మతులు చేపడతామని తెలిపారు. ఇందుకోసం త్వరలోనే నిపుణుల కమిటీ వేసి యంత్రాల పనితీరును అధ్యయనం చేసి నివేదికను తయారు చేస్తామన్నారు. నివేదిక ఆధారంగా మరమ్మతు పనులు చేపడతామని వివరించారు. గత నెల 27వ తేదీన రూ.5కోట్ల చెరకు బకాయిలను రైతుల ఖాతాల్లో యాజమాన్యం జమచేసిన విషయం తెలిసిందే. మిగిలిన బకాయిలను మంగళవారం విడుదల చేసింది. బకాయిల చెల్లింపులకు గాను యాజమన్యాం సు. దీర్ఘ జాప్యం చేస్తూ వచ్చింది.

సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో పాల్గొన్న అధికారులు

రాయికోడ్(అందోల్): మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీపీ మొగులప్ప అన్నారు. ఎంపీడీఓ మసూద్‌తో కలిసి హస్నాబాద్, కోడూర్, ఔరంగానగర్ తదితర గ్రామాల్లో మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడి గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజా సమస్యలను మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఏపీఓ రమేష్, ఆయా గ్రామాల నాయకులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **బండి సంజయ్‌పై చర్యలకు డిమాండ్**

నారాయణఖేడ్: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తల్లిపై ఇటీవల అనుచిత వాఖ్యలు చేసిన కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ మీడియా సమన్వయకర్త డాక్టర్ గిరిజాశెట్కార్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ మేరకు బీజేపీ నేత జేపీ నడ్డా, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ సునీతారెడ్డికి బండి సంజయ్‌పై ఫిర్యాదు పంపానని తెలిపారు.

◆ **ఘనంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన**

జహీరాబాద్: మొగుడంపల్లి మండలంలోని గోపన్‌పల్లి గ్రామంలో పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాంచందర్, గ్రామపెద్దలు రవీందర్‌రెడ్డి, శివారం, మాణిక్‌రెడ్డి, అంజన్న, గోపాల్‌రెడ్డి, సత్యంరెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

◆ **సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

మునిపల్లి(అందోల్): ఉపాధిహామీ పథకం ద్వారా మంజూరైన నిధులతో సీసీ రోడ్డు పనులను మండల పరిధిలోని మల్లికార్జునపల్లి గ్రామంలో ఉపసర్పంచ్ విఠల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశం, మహేశ్, గోపాల్, ఖలీంపాషా పాల్గొన్నారు.

◆ **ఘనంగా ఆలయ వార్షికోత్సవం**

హత్నూర(సంగారెడ్డి): మండల పరిధిలోని కొన్యాల గ్రామంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ **ఎంఈఓకు సన్మానం**



మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని మేళసంగ్యం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ నుంచి కొండాపూర్ మండలానికి బదిలీపై వెళ్తున్న ఇన్‌చార్జి ఎంఈఓ దశరథ్‌ను పాఠశాల ఉపాధ్యాయులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు వీరన్న, ఉపాధ్యాయులు సంధ్యారాణి, భుజంగం, గోపాల్, మంజువాణి, రత్నమ్మ, ప్రశాంతి, అనంతలక్ష్మి, సిద్దేశ్వరులు పాల్గొన్నారు.

◆ **అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

సంగారెడ్డి టౌన్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ సంగారెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అతిమేల మాణిక్‌ను మంగళవారం ఉదయం ముందస్తు అరెస్ట్ చేసి సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించినందుకు అరెస్టు చేస్తారా అని ప్రశ్నించారు. జిలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు.

◆ **చికిత్స పొందుతూ వ్యక్తి మృతి**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): మోటార్ సైకిల్ అదుపుతప్పడంతో తీవ్ర గాయాలపాలైన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భారతి నగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీకు చెందిన చందు(23) నగరంలోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కాగా సోమవారం రాత్రి తెల్లాపూర్ నుంచి పాత ఎంఐజీ కాలనీకు తన మోటార్ సైకిల్ వెళ్తుండగా తెల్లాపూర్ సర్కిల్ వద్దకు రాగానే అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్రగాయాలైన చందును చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

◆ **పన్ను చెల్లించకపోతే పెనాల్టీ**

పటాన్‌చెరు: ఆస్తి పన్ను సకాలంలో చెల్లించకపోతే రెండు శాతం వడ్డీ పెనాల్టీగా చెల్లించాల్సి వస్తుందని అమీన్‌పూర్ కమిషనర్ జ్యోతిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ఆర్థిక ఏడాదికి సంబంధించిన పన్ను బకాయిల పెనాల్టీకి సంబంధించిన పెనాల్టీ రాయితీ అవకాశం కూడా ఉందన్నారు. ఈ ఆర్థిక ఏడాదికి సంబంధించిన బకాయిలను నెలాఖరులోగా చెల్లించాలని సూచించారు.

◆ **నియామకం**

జోగిపేట(అందోల్): ఉమ్మడి మెదక్ జిల్లా టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడుగా గంగా జోగినాథ్‌గుప్తా నియమితులయ్యారు. అందోలు నియోజకవర్గం పెద్దపూర్ గ్రామానికి చెందిన జోగినాథ్ గుప్తా, జోగిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడుగా పనిచేశారు. జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ సిఫారసు మేరకు టెలిఫోన్ అడ్వైజరీ కమిటీ సభ్యుడుగా జోగినాథ్ గుప్తాను నియమిస్తూ భారత్ సంచార్ నిగమ్ కేంద్ర సీఎండీ ఊర్వశిసంగ్వార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

◆ **బాధితులకు న్యాయం చేయండి**

సంగారెడ్డి అర్బన్: పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సందేశాఖాలీ ప్రాంతంలోని మహిళలు జిహాదీ గ్రూపు ద్వారా లైంగికంగా దోపిడీకి గురవుతున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఆకాష్ అన్నారు. ఏబీవీపీ సంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో జిల్లా పరిపాలన అధికారి పరమేశంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆకాష్ మాట్లాడుతూ కొన్ని రోజులుగా దేశమంతా చర్చనీయాశమైన ఘటన పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని తణమూల్ కాంగ్రెస్ అధికార పార్టీ నాయకులు, షాజహాన్ షేక్ అతని అనుచరులు అధికారాన్ని అడ్డు పెట్టుకొని సందేశ్‌ఖాళీ ఒక మారుమూల గిరిజన తెగ ప్రాంతంలో దాడులకు పాల్పడుతున్నాయన్నారు. మహిళలపై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజు, తానాజీ, నిఖిల్, వెంకట్, మహేష్, శివ పాల్గొన్నారు.

◆ **గాదరి కిషోర్‌కు సన్మానం**

జహీరాబాద్: మాజీ ప్రభుత్వ విప్ గాదరి కిషోర్‌ను మంగళవారం ఓ ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ఉద్యమకారులకు తగిన గుర్తింపు ఇచ్చి గౌరవించారన్నారు. రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ, నాయకులు నామ రవికిరణ్, కరణ్‌రాజ్, రమేష్‌బాబు, రాజా రమేష్, పెద్దగొల్ల నారాయణ, శ్రీనివాస్, శివన్న, నరేష్‌రెడ్డి, ఫహీం ఉన్నారు.

◆ **భారీ భస్మా లింగం ఆవిష్కరణ**



సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలంలోని పసల్వాదిలోని విద్యాపీఠంలో 20.6 అడుగుల భారీ భస్మ లింగాన్ని విద్యాపీఠం వ్యవస్థాపకులు బ్రహ్మశ్రీ డాక్టర్ మహేశ్వరశర్మ సిద్ధాంతి మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.